www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -101 ఆదివారం 26 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి




**అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి**

**తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం**

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూలై 25,(ప్రజావినికిడి):** : చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయనిఅన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. ద

మిగతా 2లో.



# ధర్మేంద్రప్రధాన్ రాజీనామా..!

**నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ తప్పుకొంటున్నట్లు ప్రకటన**

**గత కొన్నిరోజుల పరిణామాలు బాధించాయని వ్యాఖ్య**

**వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం లేదని వెల్లడి**

**యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నట్లు లేఖలో పేర్కొన్న వైనం**

**మోదీకి రాజీనామా పత్రాన్ని పంపిన ప్రధాన్**

**ఢిల్లీ జూలై 25,(ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్, పరీక్షల అక్రమాలపై కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి సమర్పించిన ఆయన.. దేశ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ.. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు

మిగతా 2లో.



# డీఎస్సీ అక్రమాలకు బాధ్యతగా లోకేశ్ కూడా వైదొలగాలి

**నీట్ లీకేజీపై కేంద్ర మంత్రి రాజీనామా చేశారని జగన్ వ్యాఖ్య**

**ఎన్డీఏ ప్రమాణాలను ఏపీలోనూ పాటించాలని సూచన**

**కొడుకును కాపాడుకుంటారా అంటూ సీఎంకు జగన్ ప్రశ్న**



**అమరావతి,జూలై 25,(ప్రజావినికిడి):** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్

మిగతా 2లో.

# డిమాండ్లను అంగీకరించిన కేంద్రం...

## నిరసన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

**విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రభుత్వం హామీ**

**36 రోజుల పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కొనసాగిన ఆందోళన**

**కేంద్ర మంత్రులు, సీజేపీ నేతల సంయుక్త మీడియా సమావేశంలో ప్రకటన**



**ఢిల్లీ జూలై 25,(ప్రజావినికిడి):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో గత కొన్ని వారాలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తమ నిరసనను విరమించింది. తమ ప్రధాన డిమాండ్ అయిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు, ఇతర డిమాండ్లకు ప్రభుత్వం

మిగతా 2లో.

# ఎపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడి**



**అమరావతిజూలై 25,(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) పక్రియలో భాగంగా

మిగతా 2లో.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి**

**త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు**

**రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి**




2లో.

# పొగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి..

**శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు పట్టు**

**పొగాకు రైతుల సమస్యలపై రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం**

**తాత్కాలిక ఉపశమనం కాదు, శాశ్వత పరిష్కారం కావాలన్న సీఎం**

**రైతులను ఆదుకునేందుకు కేంద్ర బృందం మూడు ప్రతిపాదనలు**

**బయ్యర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు..**



2లో.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్..

**040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు, ఇతర పత్రాలు అవసరం లేదు**

**ఇల్లు రాకపోతే రూ.10 వేల డిపాజిట్ వెనక్కి వస్తుంది**

**లబ్ధిదారుడు రూ.6 లక్షలు చెల్లిస్తే చాలు, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ**

**హైదరాబాద్ ,జూలై 25,(ప్రజావినికిడి):** హైదరాబాద్ నగరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి అపోహలకు



మిగతా 2లో.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..!

**(మొదటి పేజీ తరువాయి)**

వెలుగులోకి రాగానే కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని, పరీక్షను రద్దు చేసి రీ-ఎగ్జామ్ నిర్వహించిందని గుర్తు చేశారు. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

20 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేశాయని ప్రధాన్ చెప్పారు. పరీక్షా మాఫియా వల్ల ఒక్క ప్రతిభావంతుడికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో మొదటి రోజు నుంచే తాను బాధ్యత తీసుకున్నానని తెలిపారు. అయితే రీ-ఎగ్జామ్ ఫలితాల సమయంలో కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు.

గత పది రోజులుగా జరిగిన పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని, ఇది వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ స్పష్టం చేశారు. జంతర్‌మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, దేశ వ్యతిరేక శక్తులు ఈ అంశాన్ని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా కాపాడేందుకు, వారు చదువుపై దృష్టి పెట్టేలా చేయడానికే తాను రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, ప్రజాసేవను ఇకముందు కూడా కొనసాగిస్తానని పేర్కొన్నారు.కొందరు నిరుద్యోగులను ఉద్దేశించి సీజేఐ చేసిన వ్యాఖ్యలతో పుట్టిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ).. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలో అవకతవకలపై 2026 జూన్ నుంచి ఉద్యమం మొదలుపెట్టింది. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహార దీక్షతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఢిల్లీలోని జంతర్‌మంత్ వేదికగా సాగిన ఈ పోరు అనతి కాలంలో అనూహ్య ఆదరణను సొంతం చేసుకుంది. జులై 20న పార్లమెంట్ ముట్టడి లక్ష్యంగా తలపెట్టిన 'చలో సంసద్' కార్యక్రమంతో ఉద్యమం మరో స్థాయికి చేరింది. పోలీసుల లాఠీఛార్జి, వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం వంటి పరిణామాలతో దేశవ్యాప్తంగా యువత, ప్రముఖులు తమ గొంతుకను వినిపించారు.దీంతో దిగొచ్చిన కేంద్రం విద్యార్థులతో చర్చలు ప్రారంభించింది. స్వయంగా ప్రధాని ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రకటనలు చేశారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేపర్ లీక్ కేసులను వేగంగా విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే సంబంధిత చట్టాలను సైతం కఠినతరం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులతో శుక్రవారం రెండు దఫాలు చర్చలు జరిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. వాటిలో నీట్ పేపర్ లీక్ వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, నిరసన చేపట్టిన విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని హామీ వంటి వాటికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో వాంగ్‌చుక్ సైతం తన దీక్షను విరమించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో మాత్రం సంశయించింది. కానీ, విద్యార్థులు ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పడంతో మంత్రి రాజీనామా చేయక తప్పలేదు.

# పొగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి..

**అమరావతి,జూలై 25,(ప్రజావినికిడి):**

రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన నిరంతర సంప్రదింపుల ఫలితంగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి బృందాన్ని రాష్ట్రానికి పంపింది. శనివారం కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ భేటీ అయ్యారు.ఈ కీలక సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టొబాకో బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు రూపొందించిన మూడు కీలక ప్రతిపాదనలపై కేంద్ర బృందం సీఎంతో చర్చించింది. వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి అంశాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఏటా ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. "తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలతో ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అందరి సమష్టి బాధ్యతతోనే ఇది సాధ్యం" అని ఆయన అభిప్రాయపడ్డారు. పంటను నిల్వ ఉంచుకుని ధరలు స్థిరపడ్డాక అమ్ముకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చర్చలను ముందుకు తీసుకెళ్లి, పరిష్కారం కనుగొనాలని కేంద్ర మంత్రి పెమ్మసానికి సూచించారు.సీఎం సూచనల మేరకు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలిసి పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, బయ్యర్లు కూడా సహకరించాలని కోరారు. తదుపరి చర్చల కోసం సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని రైతుల కష్టాలను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**హైదరాబాద్,జూలై 25,(ప్రజావినికిడి):**



రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఎ÷-లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక త్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷-లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్లను అంగీకరించిన కేంద్రం...

**(మొదటి పేజీ తరువాయి)**

అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రులు, సీజేపీ ప్రతినిధులు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం... కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ లతో సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా మరో దఫా చర్చలు జరిపారు. చర్చలు ముగిసిన అనంతరం జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు అంగీకరించిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్న సద్భావనతో నిరసనను తక్షణమే విరమిస్తున్నట్లు వారు తెలిపారు. తమ మద్దతుదారులంతా శాంతియుతంగా ఇళ్లకు తిరిగి వెళ్లాలని పిలుపునిచ్చారు.మంత్రి రాజీనామాతో పాటు, ప్రభుత్వం మరికొన్ని కీలక హామీలు ఇచ్చినట్లు సీజేపీ నేతలు వెల్లడించారు. నీట్ ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఉపసంహరించుకుంటామని, భవిష్యత్తులో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అలాగే, నీట్ వ్యవహారంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం గరిష్ఠ పరిహారం అందజేస్తామని స్పష్టం చేసిందని వివరించారు.ఈ సందర్భంగా సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరించింది. కాబట్టి ఆందోళన చేస్తున్న వారందరూ తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని కోరుతున్నాం" అని అన్నారు. అశుతోష్ రంకా మాట్లాడుతూ, "36 రోజుల నిరసన తర్వాత ప్రభుత్వం దిగివచ్చింది. మా డిమాండ్లు తీవ్రమైనవి కావు, చాలా సాధారణమైనవి. ఇప్పుడు ప్రభుత్వం వాటిని ఆమోదించింది" అని పేర్కొన్నారు

# ఎపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు. అత్యధికంగా 44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,22,174 మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216 గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు. అర్హులైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన డాక్యుమెంట్లను చూపించి, మరలా ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు సీఈఓ వివేక్ యాదవ్ ప్రకటించారు.

# డీఎస్సీ అక్రమాలకు బాధ్యతగా లోకేశ్ కూడా వైదొలగాలి

**(మొదటి పేజీ తరువాయి)**

పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు.ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డీఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు.ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని నిలదీశారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ పాటిస్తున్న ప్రమాణాలను రాష్ట్రంలో ఎందుకు విస్మరిస్తున్నారని జగన్ తన పోస్టులో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్..

**(మొదటి పేజీ తరువాయి)**

తావులేకుండా పూర్తి సమాచారం అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రజలు దళారులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఫోన్ చేసి అధికారిక సమాచారం పొందాలని సూచించారు. ఈ కాల్ సెంటర్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందిస్తుందని తెలిపారు.

దరఖాస్తు చేసుకునే సమయంలో కేవలం ఆధార్ నంబర్ ఉంటే సరిపోతుందని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ సమయంలో ఆ పత్రాలను సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో రూ.10,000 ఈఎండీని కేవలం యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని తెలిపారు. ఒకవేళ లాటరీలో ఇల్లు కేటాయించకపోతే, ఆ మొత్తం తిరిగి అదే ఖాతాకు జమ అవుతుందని భరోసా ఇచ్చారు.హైదరాబాద్ క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని మంత్రి వివరించారు. దరఖాస్తుదారుడికి గానీ, కుటుంబ సభ్యులకు గానీ ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఫ్లాట్ ఉండకూడదన్నారు. సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1బీహెచ్‌కే ఫ్లాట్‌ను నిర్మిస్తున్నామని, దీని మార్కెట్ విలువ రూ.40-60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనుండగా, లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో పాటు 20 నుంచి 25 గజాల అవిభాజ్య వాటా (ఖణా) స్థలాన్ని కూడా లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పొంగులేటి తెలిపారు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హుల సంఖ్య ఎక్కువగా ఉంటే లాటరీ ద్వారా పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి పాల్గొన్నారు.ద

# కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి

## ప్రస్తుతం ఆహారం, పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రిగానూ జోషి బాధ్యతలు

**ఢిల్లీ జూలై 25,(ప్రజావినికిడి):**



దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వివాదం కేంద్ర మంత్రివర్గంలో కీలక మార్పుకు దారితీసింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం నేపథ్యంలో, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. అనంతరం, ఆయన స్థానంలో సీనియర్ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగిస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకుంది.

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన తన రాజీనామాను సమర్పించారు. ప్రధానమంత్రి సలహా మేరకు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(2) ప్రకారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి తక్షణమే ఆమోదించారు.నూతన విద్యాశాఖ మంత్రిగా నియమితులైన 64 ఏళ్ల ప్రహ్లాద్ జోషి, కర్ణాటకలోని ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2004 నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా (2019-2024) సమర్థంగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఆహార (ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన), పునరుత్పాదక ఇంధన (పీఎం సూర్య ఘర్ యోజన) శాఖల మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కర్ణాటకలో మధ్యాహ్న భోజన పథకాలతో ఆయనకు గతంలో అనుబంధం ఉంది.ఈ నియామక ప్రకటన వెలువడే సమయానికి ప్రహ్లాద్ జోషి తన నియోజకవర్గంలో పర్యటనలో ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆయన పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని, హుబ్లీ నుంచి రాత్రి 7:30 గంటల విమానంలో ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ పదవీకాలంలో నూతన జాతీయ విద్యా విధానం (NEP 2020) అమలుతో పాటు అనేక సంస్కరణలు జరిగాయని ప్రశంసించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 26 జూలై 2026

## ఈ నెల 28 నుండి దిల్సుఖ్నగర్ సాయిబాబా ఆలయంలో

# గురుపూర్ణిమ మహోత్సవవేడుకలు..





**దిల్సుక్నగర్,(ప్రజావినికిడి):** దక్షిణ షిరిడిగా పేరొందిన దిల్సుఖ్నగర్ శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు శ్రీ గురుపూర్ణిమ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఛైర్మన్ డా. లింగయ్య తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ వేడుకల్లో భాగంగా ప్రధానంగా లోక కళ్యానార్థం యాదగిరిగుట్ట కమిటీ మెంబర్ మాజీ ఆలయ చైర్మన్ గుండా మల్లయ్య ఆధ్వర్యంలో స్వామి ఓం స్వరూప్ జి చేతుల మీదుగా సామ మహా యజ్ఞం కార్యక్రమాన్ని అత్యంత వైభవపేతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యజ్ఞ మహా కార్యక్రమానికి ప్రముఖులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. పవిత్ర నదీ జలాలతో మంగళస్నానాలు108 వెండి కలశాభిషేకాలు, విశేష పూజలు, గురుచరిత్ర పారాయణం, భక్తులకు భజనలు & భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామన్నారు.ఉదయం కాకడ హారతితో ప్రారంభించి, బాబాకు ప్రత్యేక అభిషేకాలు, మంగళస్నానం, దివ్యాలంకరణ, మరియు విశేష పూజలు నిర్వహిస్తారు. నైవేద్యం, మధ్యాహ్నం ఉచ్ఛిష్ట/అఖండ హారతి, సాయంత్రం ధూప్ హారతి అలాగే రాత్రి శేజ్ హారతి సేవలు ఉంటాయి. ఆలయ ప్రాంగణంలో సాయిబాబా ఉత్సవ మూర్తికి ప్రత్యేక పల్లకీ సేవ అదేవిధంగా రోజంతా అఖండ సాయి నామజపం నిర్వహిస్తారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ దర్శనంతో పాటు శీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా విస్తృతం చేసి, ప్రత్యేక భద్రతా సిబ్బందిని (సెక్యూరిటీ గార్డులు, వాలంటీర్లు) నియమిస్తారు. దిల్సుఖ్నగర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లు వూర నరసింహా గుప్తా, బీరప్ప,జనరల్ సెక్రెటరీ వి వి రవికుమార్, ఫైనాన్స్ సెక్రటరీ బి కిరణ్ కుమార్, జాయింట్ సెక్రటరీలు కోడి రాజశేఖర్,పి కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పద్మాకర్ ఆత్రే, బివి శ్యామ్ కుమార్,ఎం. శ్యామల రావు, పి.లక్ష్మీ,దుర్గ లు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పై

# క్రిమినల్ కేసు నమోదు చేయాలి



**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):** ఒక దేశానికి ప్రధాని అంటే దేశ ప్రజల సమస్యలకు బాధ్యత వహించాల్సిన వ్యక్తి.కానీ నిన్న అర్ధరాత్రి విడుదల చేసిన వీడియోలో ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థుల భవిష్యత్తు,నీట్ పేపర్ లీకులు, నిరుద్యోగుల ఆవేదన వంటి అత్యంత తీవ్రమైన అంశాలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో రాజకీయ ప్రచార వీడియోల మాదిరిగా వ్యవహరించడం అత్యంత బాధాకరం, ఖండనీయమైనదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సరిపోదని, 23మంది విద్యార్థుల మరణాలకు మరియు నీట్ పేపర్ లీకేజీలకు బాధ్యుడిగా ప్రధాన్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ నుండి వై జంక్షన్ కూడలి వరకు కేంద్ర ప్రభుత్వ శవయాత్ర ర్యాలీని నిర్వహించి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన దహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనలో ఉన్న వేళ,వారిని ఓదార్చే బదులు ప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వడం మోడీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారుఒక దేశానికి ప్రధాని అంటే అర్ధరాత్రి వీడియోలు పెట్టడం కాదని.. దేశ యువతకు న్యాయం చేయాలన్నారు. నిన్న 12 గంటలకు వీడియో విడుదల చేసిన ప్రధాని,ఈరోజు దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్యాయాలకు కూడా అంతే అత్యవసరంగా స్పందించాలని డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీకులు, పరీక్షల అక్రమాలు, నిరుద్యోగం,ఖాళీ ఉద్యోగాల భర్తీ, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై మౌనం వీడి స్పష్టమైన చర్యలు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్, మధు,వెంకటేష్, మధుకర్,అలీ, రాహుల్,కిరణ్, ప్రదీప్,రమేష్, సాయి,భరత్, ధీరజ్ లతో పాటు 50మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంస్కృతిక సామాజిక ప్రాముఖ్యత ఆషాడ మాసం

### గోరింటాకు మహిళలకు అదృష్టానికి చిహ్నం..



**మెట్టుగూడ,(ప్రజావినికిడి):** శనివారం రోజు తెలంగాణ రాష్ట్ర రజక మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆషాడమాసం లో గోరింటాకు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక మహిళా సంఘం మహిళలు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం నిర్వహించిన మహిళా నాయకురాలు శ్రీమతి అమ్ములు మహిళా సంఘం జనరల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం లో ఉన్న మహిళలందరూ పాల్గొన్నారు. శ్రీమతి మల్లేశ్వర పు రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంతో ఆనందకరమైన ఆషాడ మాసంలో ఈ మాసంలో ఆడపడుచులు కలిసి గోరింటాకు కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఆషాడ మాసంలో గోరింటాకు పండుగ హిందూ సాంప్రదాయాల్లో పల్లెల్లో గోరింటాకు చెట్టు నుంచి కోసిన మైదాకును రోట్లో వేసి రుబ్బి మహిళలందరూ ఒకచోట చేరి అమ్మవారికి ప్రత్యేక పూజ చేసి మహిళందరూ గోరింటాకు ఒకరికి ఒకరుపెట్టుకుని చేతులకు పెట్టుకొని మురిసిపోతారు శాస్త్రీయంగా మైదాకు గురించి గొప్పగా వివరించారుప్రతి ఈమహిళలు ఆషాడ శ్రావణ మాసంలో కాకుండా ప్రత్యేక హిందూ పండుగలలో కూడా మైదాకును ఒక ప్రత్యేకత ఉంది మైదాకును అమ్మవారి స్వరూపంగా భావిస్తారు అని రాజేశ్వరి వివరించారు మహిళా ఒక ఆరోగ్య సూత్రాలు ఉన్నాయని తెలిపారుఒకరు మహిళలకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోతారు గోరింటాకు ఆరోగ్య సూత్రాలు ఉన్నాయని భావిస్తారు ఎండాకాలముసిన తర్వాత వచ్చే వర్షాకాలం లో వచ్చేఇన్ఫెక్షన్ నుంచి రక్షణ ఇస్తుందని ఇన్ఫెక్షన్ నుంచి రక్షణ ఇస్తుందని మహిళలు చెప్తున్నారు.ఈ కార్యక్రమంలో ప్రసన్న లోవ దుర్గ భవాని జ్యోతి విజయ ఉష రాధ లక్ష్మి హనీ నీలవేణి తేజు భవాని మొదలైన మహిళలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీసీలకు రాజ్యాధికారం దక్కే రోజు ఎప్పుడు.?

**ఇంకెన్నాళ్లు ఈ వెనుకబాటుతనం..**

**బీసీ ఉద్యమ నాయకులు కోహీర్ శ్రీనివాస్..**



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** జనాభాలో మెజారిటీ. అధికారంలో ఎందుకు వెనుకబాటు? ఇదే ప్రశ్న దశాబ్దాలుగా వెనుకబడిన తరగతుల (బీసీల) నుంచి వినిపిస్తోంది.దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే రైతులు, చేతివృత్తిదారులు,కార్మికులు, చిన్న వ్యాపారులు, సేవారంగానికి చెందిన అనేక వర్గాలు బీసీల్లోనే ఉన్నప్పటికీ, అత్యున్నత రాజకీయ పదవులు, నిర్ణయాత్మక స్థానాల్లో వారి ప్రాతినిధ్యం తగిన స్థాయిలో లేదనే అభిప్రాయం తరచుగా వ్యక్తమవుతోంది.

ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల చేతుల్లో ఉండాలని రాజ్యాంగం చెబుతోంది. అయితే జనాభాలో పెద్ద వర్గంగా ఉన్న బీసీలకు పాలనా వ్యవస్థలో ఎంత మేరకు భాగస్వామ్యం దక్కుతోంది? వారి సమస్యలు, ఆశయాలు, అవసరాలు నిర్ణయాత్మక స్థాయికి ఎంతవరకు చేరుతున్నాయి? అనే అంశాలపై చర్చ కొనసాగుతోంది.

బీసీలకు రాజ్యాధికారం అంటే కేవలం ముఖ్యమంత్రి లేదా మంత్రి పదవులు మాత్రమే కాదు. శాసనసభలు, పార్లమెంట్, స్థానిక సంస్థలు, ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లు, విధాన నిర్ణయ కమిటీల్లోనూ సముచిత ప్రాతినిధ్యం ఉండాలని పలువురు సామాజికవేత్తలు,బీసీ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. రాజకీయ అవకాశాలు విస్తరించినప్పుడే సామాజిక న్యాయం మరింత బలపడుతుందని వారు వాదిస్తున్నారు.

బీసీ వర్గాల్లో ఐక్యత, రాజకీయ చైతన్యం,విద్య, నాయకత్వ వికాసం, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో చురుకైన భాగస్వామ్యం పెరిగినప్పుడే వారి రాజకీయ ప్రభావం కూడా పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో అభ్యర్థుల ఎంపిక, నాయకత్వ అవకాశాలు, విధాన రూపకల్పనలో అన్ని రాజకీయ పార్టీలు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కూడా సూచిస్తున్నారు.

“బీసీలకు రాజ్యాధికారం దక్కే రోజు ఎప్పుడు?“ అనే ప్రశ్నకు సమాధానం ఒక్క రోజులో రాదు. ప్రజల మద్దతు, రాజకీయ సంకల్పం, సమాన అవకాశాలు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధానాల ద్వారా మాత్రమే ఆ లక్ష్యం సాధ్యమవుతుంది.సమాన ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల బలోపేతమే ఆ దిశగా ముందడుగుగా నిలుస్తుంది.

## ఘనంగా తెలంగాణ ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి జన్మదిన వేడుకలు





**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** చైతన్య విద్యానికేతన్ విద్య సంస్థల అధినేత తెలంగాణ ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి జన్మదినాన్ని పురస్కరించుకొని జగద్గిరిగుట్ట మగ్దుమ్ నగర్ లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్నీ పురస్కరించుకొని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం బృందం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధికి ఎంతో చేయూతనిస్తూ కవిగా కళాకారుడిగా ఎదిగిన ఆయన ఎంతోమందికి ఆదర్శనీయం అని కొనియాడారు. విద్యాసంస్థలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ కుత్బుల్లాపూర్ మండల ప్రైవేట్ విద్యా సంస్థల అధ్యక్షుడి నుండి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులుగా ఎదిగిన ఆయన ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. నిరంతర కృషి పట్టుదల, పోరాటపటిమఆయన విజయానికి సోపానాలు. అంతేకాకుండా పాఠశాలలో విద్య అభ్యసించే పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనిస్తూ సహాయ సహకారాలు అందిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య బృందం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో 126 డివిజన్ కార్పొరేటర్ కె. జగన్,125 డివిజన్ కార్పొరేటర్ శేషగిరి రావు,బిజేపి నాయకులు శేఖర్ యాదవ్,కాంగ్రెస్ నాయకులు ఎస్ రశీద్, టిఆర్ఎస్ నాయకులు జైహింద్,ట్రస్మా మేడ్చల్ ప్రెసిడెంట్ జె. నాగరాజు, ట్రెజరర్ పరశురామ్ గౌడ్, ట్రస్మా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వనజ అశోక్,డానియల్ రాజు,ట్రస్మా కుత్బుల్లాపూర్ మండల్ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి, సెక్రటరీ నర్సిరెడ్డి,ట్రెజరర్ పవన్ కుమార్, గండిమైసమ్మ మండల్ ప్రసిడెంట్ ప్రవీణ్ కుమార్,సెక్రటరీ అంబదాస్, మెడిపల్లి మండల్ ప్రెసిడెంట్ కమలాకర్ రావు, సెక్రటరీ రవిబాబు, ట్రెజరర్ సుబ్రహ్మణ్యం, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ రావు, ట్రస్మా స్టేట్ అడ్వసైర్ రవీందర్ రావు, మల్లేష్,వెంకట్ స్వామి,శ్రీశైలం యాదవ్,జగన్, బాచుపల్లి మండల్ ట్రజరర్ రాంబాబు, సుధాకర్ అదేవిదంగా హేల్పింగ్ హాట్స్ సోసైటీ మధు, విజయ్ అలాగే చైతన్య విద్యా నికేతన్ పాఠశాల డైరెక్టర్స్ శివరాత్రి మంగాదేవి, శృతివిద్య, మధుసూదన్, నిఖిల్,ప్రిన్సిపాల్ శివరాత్రి సాయితేజ పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో

# ఘనంగా ‘ఆల్-న్యూ బ్రెజ్జా‘ కారు ఆవిష్కరణ

**5-స్టార్ భారత్ ఎన్క్యాప్ సేఫ్టీ రేటింగ్‌తో సరికొత్త బ్రెజ్జా**



**ఎల్బీనగర్,జూలై 25,(ప్రజావినికిడి):** వనస్థలిపురం: ప్రముఖ మారుతీ సుజుకి కార్ల డీలర్ ‘వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్‘ ఆధ్వర్యంలో సరికొత్త ‘ఆల్-న్యూ బ్రెజ్జా‘ కారు మార్కెట్లోకి విడుదలైంది. వనస్థలిపురం ఆటోనగర్‌లోని వరుణ్ మోటార్స్ షోరూమ్‌లో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి స్థానిక రాజకీయ నాయకులు మరియు మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ రీజినల్ మేనేజర్ జి. పార్తిబన్ ముఖ్య అతిథులుగా హాజరై కారును లాంచ్ చేశారు.భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కాంపాక్ట్ ఎస్‌యూవీగా పేరుగాంచిన బ్రెజ్జా.. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ అత్యాధునిక ఫీచర్లతో రావడం విశేషం. అల్ట్రా-హై-టెన్సైల్, హై-టెన్సైల్ స్ట్రెంగ్త్ స్టీల్‌తో కారు బాడీని పునాది స్థాయి నుంచి అత్యంత పటిష్టంగా రూపొందించారు. అరేనా సేఫ్టీ షీల్డ్ లో భాగంగా.. అన్ని వేరియంట్లలో ఫ్రంట్,సైడ్ మరియు కర్టెన్ కలిపి మొత్తం 6 ఎయిర్‌బ్యాగ్‌లను స్టాండర్డ్‌గా అందిస్తున్నారు. ప్రమాదాలను ముందుగానే పసిగట్టి నివారించేందుకు బ్లైండ్ స్పాట్ వార్నింగ్ (లైన్ చేంజ్ అలర్ట్ తో), రియర్ క్రాస్ ట్రాఫిక్ అలర్ట్, సేఫ్ ఎగ్జిట్ వార్నింగ్, ఎమర్జెన్సీ స్టాప్ సిగ్నల్ వంటి సరికొత్త యాక్టివ్ సేఫ్టీ ఫీచర్లు ఇందులో పొందుపరిచారు. అంతేకాకుండా, ఇరుకైన ప్రదేశాల్లో కూడా కారును సులభంగా పార్క్ చేయడానికి వీలుగా 360 వ్యూ కెమెరా, ఫ్రంట్ మరియు రివర్స్ పార్కింగ్ సెన్సార్లు,రియర్ పార్కింగ్ కెమెరా వంటి అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయి.హిల్ హోల్డ్ అసిస్ట్‌తో కూడిన ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, ఈబీడీతో కూడిన యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్ డ్రైవింగ్ మరియు వాహన నియంత్రణను మరింత మెరుగుపరుస్తాయి.వీటితో పాటు టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, చిన్నపిల్లల భద్రత కోసం చైల్డ్ సీట్ యాంకరేజ్‌లు, రియర్ డిఫాగర్ మరియు వైపర్ తదితర ప్రత్యేకతలతో ఈ ‘ఆల్-న్యూ బ్రెజ్జా‘ వినియోగదారుల ముందుకు వచ్చింది.ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సి. రాజు,సీజీఎం కౌశిక్ సెల్వరాజ్, జీఎం కె.కృష్ణ కుమార్,బ్రాంచ్ మేనేజర్ అశోక్, సిబ్బంది, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

**డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి -మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన**



**హైదరాబాద్,జూలై 25,(ప్రజావినికిడి):** ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు.

కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

## ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తమ హక్కుగా, బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. శనివారం పెట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత ఎన్నికల సిబ్బందికి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి పౌరుడు తన కుటుంబ సభ్యులతో పాటు పొరుగువారు, స్నేహితులు, బంధువులను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని,ఓటు విలువను అందరికీ తెలియజేస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు మహేశ్వరి, రాజ్‌కుమార్, బీఎల్ఏలు వినయ్, లావణ్య,ప్రసాద్ పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నకొలన్ హన్మంత్ రెడ్డి..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని శ్రీనివాస నగర్‌లో గల శ్రీశ్రీశ్రీ శ్రీనివాస అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కొలన్ హన్మంత్ రెడ్డి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖ: శాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఆనందంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి), వరగాని వాసు, కొలన్ జీవన్ రెడ్డి,మురళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావూరి మౌళేశ్వర రావు , స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీనివాస నగర్ కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):**



సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, నిజాంపేట్ సర్కిల్,ప్రగతి నగర్ డివిజన్-276 పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి), మహాదేవపురం డివిజన్ అధ్యక్షుడు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, వారాగాని వాసు, కొలన్ జీవన్ రెడ్డి, మురళి,డీసీసీ ప్రధానకార్యదర్శి రావూరి మౌళేశ్వర్ రావు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## పేదల రేషన్ బియ్యంపై దందా.. గజ్వేల్‌లో అక్రమ వ్యాపారిపై పీడీ యాక్ట్..

### ఆరు కేసులతో నేరచరిత్ర.. చెర్లపల్లి జైలుకు తరలింపు..

### అక్రమ రవాణాదారులకు సిపి రష్మీ పెరుమాళ్ కఠిన హెచ్చరిక..



**గజ్వేల్,(ప్రజా వినికిడి):** పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ చేసి,బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్న ప్రధాన అక్రమ వ్యాపారిపై సిద్దిపేట పోలీసులు ఉక్కుపాదం మోపారు. బచ్చు రత్నాకర్ (46) అనే నిందితుడిపై పీడీ (ప్రివేంటివ్ డిటెన్షన్)యాక్ట్ నమోదు చేసి, శనివారం చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు తెలంగాణ రాష్ట్ర పీడీఎస్ నియంత్రణ ఉత్తర్వులు-2016 మరియు అవసర వస్తువుల చట్టం-1955 నిబంధనలను ఉల్లంఘిస్తూ రేషన్ కార్డుదారులు, రేషన్ డీలర్ల నుంచి తక్కువ ధరలకు బియ్యాన్ని కొనుగోలు చేసి, రాయిపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని వీరభద్ర రైస్ మిల్‌లో అక్రమంగా నిల్వ ఉంచి,రీసైక్లింగ్ చేసి,అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పేదలకు అందాల్సిన ఆహార భద్రతకు తీవ్ర విఘాతం కలిగిందని పోలీసులు తెలిపారు. నిందితుడిపై 2024లో రెండు కేసులు, 2026లో నాలుగు కేసులు నమోదై ఉండటంతో అతని నేరచరిత్రను సమగ్రంగా పరిశీలించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ పీడీ యాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. అక్రమ రవాణాదారులకు సిపి స్ట్రాంగ్ వార్నింగ్‌పేదల నోటి ముద్దను దోచుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం..ప్రజా పంపిణీ వ్యవస్థకు విఘాతం కలిగించే అక్రమ రవాణాదారులపై భవిష్యత్తులో కూడా పీడీ యాక్ట్ సహా అత్యంత కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయిఅని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గం లో పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయండి..

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**

శనివారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన సమస్యల మీద మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు మరియు ప్రజా సమస్యలపై చర్చించి,త్వరితగతిన చర్యలు చేపట్టలని కోరారు. దానిలో భాగంగా గతంలో మేము తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డు వెడల్పు విషయంలో మేము మిమ్మల్ని కలవడం జరిగింది. మీరు వెంటనే స్పందించి అట్టి రోడ్డును పరిశీలించడం జరిగింది. దానికి ధన్యవాదాలు. చంపాపేట్ డివిజన్ సుల్తాన్‌వాల్వ మినీ ఫంక్షన్ హాల్ పునరుద్ధరణ, సుల్తాన్‌వాల్వ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్,షెడ్,మరుగుదొడ్లు బోర్‌వెల్ వంటి మౌలిక సదుపాయాల పనులు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని మహా గాయత్రీ నగర్ సీ.సీ.రోడ్డు మరియు ఓపెన్ జిమ్ పనులు. హయత్ నగర్ డివిజన్ సాయి గార్డెన్ కాలనీ సీ.సీ.రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉంది. దీనికి తక్షణ మంజూరు మరియు నిర్మాణం అవసరం అని కోరారు. మన్సూరాబాద్ డివిజన్ పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణ,



మహావీర్ హరిణీ వనస్థలి ద్వారా ఆక్రమణకు గురైనట్లుగా భావిస్తున్న మన్సూరాబాద్ పాత పోచంపల్లి రోడ్డును తిరిగి స్వాధీనం చేసుకుని,పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రోడ్డు దాదాపు 50 కాలనీలకు కీలక అనుసంధాన మార్గంగా ఉంది ఇది 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పాత జిల్లా పరిషత్ (జెడ్పి) రోడ్డు. ఇది గెజిట్‌లో కూడా నమోదై ఉంది. ఇది ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ ఆర్)కు ముఖ్యమైన అనుసంధానాన్ని కల్పిస్తుంది అలాగే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి ఈ రోడ్డు పునరుద్ధరణను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని కోరారు. బి.ఎన్.రెడ్డి డివిజన్ నందు పలు అభివృద్ధి పనులకు త్వరితగతిన ఆమోదం మరియు అమలు కోరడమైనది. హరిహరపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ పైన మొదటి అంతస్తు (అదనపు అంతస్తు) నిర్మాణం. విజయపురి ఫేజ్-× సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం పైన మొదటి అంతస్తు (అదనపు అంతస్తు) నిర్మాణం. విజయ్ నగర్ (ఎస్ ఎస్ వి కాలనీ)లో ప్లాట్ నం. 77 నుండి ప్లాట్ నం.54 వరకు అంతర్గత సి.సి.రోడ్డు నిర్మాణం. ఎస్.కే.డి నగర్‌లో పలు అంతర్గత సి.సి.రోడ్ల నిర్మాణం. వివేకానంద పార్క్ (ఎన్జీవోస్ కాలనీ)లో ఓపెన్ జిమ్ అదేవిదంగా పిల్లల ఆటల పరికరాల ఏర్పాటు. మెడికల్ & హెల్త్ కాలనీలో ఓపెన్ జిమ్ అలాగే పిల్లల ఆటల పరికరాల ఏర్పాటు. అలాగే బి.ఎన్.రెడ్డి.నగర్ లోని మారుతీ నగర్ నందు ఉన్న పార్క్ స్థలం చుట్టు కాంపౌండ్ వాల్ నిర్మించాలని,యుద్ధప్రాతిపదికన పార్కు నిర్మించాలని కోరారు. కప్రాయి చెరువు ఫారెస్ట్ నుండి దిగువకు వరదనీటి కాలువ పనులు సగం పూర్తయ్యాయని మిగిలిన సగం పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే శివసాయి కాలనీ నందు ఓపెన్ డ్రైన్స్ పనులు పూర్తి చేయాలనీ కోరారు. అలాగే ఇట్టి పనులకు సంబందించిన వివరాలు జోనల్ కమీషనర్ కార్యాలయం నందు ఆమోదం కోసం వేచి ఉన్నాయని కావున పైన పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని దయచేసి వీటిపై చర్చను ఏర్పాటు చేయవలసిందిగా మరియు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పరిష్కరించి పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ, రెండు,మూడు రోజుల్లో అధికారులచే సమావేశం ఎర్పాటు చేయించి త్వరితిగతిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద రెడ్డి,భాస్కర్ సాగర్,రవి ముదిరాజ్,గండికోట శ్రీనాద్ పలు కాలనీల అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మీయులలో ఐటీ దిగ్గజాలు

### విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ భేటీ




**హైదరాబాద్,(ప్రజావినికిడి):**విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఐటీ ప్రొఫెషనల్ ఫ్రెండ్లీ మీట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నగరంలోని వాసవి క్లబ్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీ రంగానికి చెందిన విశ్వకర్మ ప్రముఖులు హాజరయ్యారు. విశ్వకర్మలు ఏకీకృతం కావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి అని కొనియాడారు. విశ్వకర్మలు అయిదు వృత్తులలోనే కాకుండా,అన్ని రంగాలలోనూ అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని వక్తలు అన్నారు. ప్రపంచంలోని దిగ్గజ ఐటీ కంపెనీలలో విశ్వబ్రాహ్మణులు సత్తా కనబరుస్తున్నారని,డల్లాస్ నుండి వచ్చిన గ్లోబల్ విశ్వకర్మ సంస్థ ప్రతినిధి చైతన్య తెలిపారు. విశ్వకర్మ జాతికి చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులై సమాజానికి ఉపయోగపడే స్థాయిలో ఉన్న వ్యక్తుల్ని గుర్తించి వారి సహాయ సహకారాలు తీసుకుని ముందుకెళ్లాలని ఇతర వక్తలు సూచించారు. విశ్వకర్మ కులానికి చెందినవారందరిని ఒక వేదిక పైకి తీసుకుని వచ్చి జేఏసీ ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించి జనాభా లెక్కలు తేల్చాలని అందరూ అభిప్రాయపడ్డారు. విశ్వకర్మ ఐదు కులాలకు చెందిన వారిని ప్రభుత్వం గుర్తించి అన్ని కులాలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. మున్ముందు అన్ని రంగాల్లో ఉన్న విశ్వకర్మ కమ్యూనిటీకి చెందిన వారందరితో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని కన్వీనర్ దేవరకొండ కాళిదాస్, కోకన్వీనర్ అద్దూరి రవీంద్ర చారి తెలిపారు. ఈ సమావేశంలో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ కన్వీనర్, కో-కన్వీనర్ అద్దూరి రవీంద్ర చారి, విశ్వవిశ్వాని యూనివర్శిటీ వ్యవస్థాపకులు తాడూరి శ్రీనివాస చారి, హెచ్ఎస్బీసీ డైరక్టర్,గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ సంఘం ప్రతినిధి చైతన్య,ప్రవాస భారతీయుడు మారోజు వెంకట్, సాఫ్ట్‌వేర్ రంగం ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

## షాద్ నగర్ మున్సిపల్ విద్యుత్ కార్మికుడికి ప్రమాదం,ఆస్పత్రికి తరలింపు

### ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న బాధితుడిని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,కమిషనర్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**మున్సిపల్ విద్యుత్ కార్మికుడు భూషణ్ లింగం శనివారం ప్రమాదానికి గురయ్యాడు.(5)వ వార్డు లోని ఢిల్లీ వరల్డ్ పాఠశాల సమీపంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి నిచ్చెన పైనుండికిందపడ్డాడు. సమీపంలోని స్థానిక వార్డ్ కౌన్సిలర్ రాజు నాయక్ ఉండడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన కార్మికుడు లింగంకు వెంటనే (సిపిఆర్)చేశారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తోటి మున్సిపల్ సిబ్బంది,అధికారులు కలిసి తరలించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందేమోహన్,మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి,తదితరులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని లింగం ఆరోగ్య పరిస్థితిని



పరిశీలించారు. మెరుగైన చికిత్స కోసం లింగంను శంషాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు. లింగం మున్సిపాలిటీలో విద్యుత్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధినిర్వహణలో పనిచేస్తున్న సందర్భంగా షాక్ తగిలి ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి తెలిపారు.



## విద్యార్థులు లక్ష్యంపై దృష్టి, బెదిరింపులు,ర్యాగింగ్ లు ఉంటే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి..

### షాద్‌నగర్ జోన్ డీసీపీ సిహెచ్ శిరీష, రాఘవేంద్ర - సైబర్ భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** సంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను షాద్‌నగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) సిహెచ్.శిరీష రాఘవేంద్ర శనివారం సందర్శించారు. డిసిపి సిహెచ్.శిరీష పలు విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు తమ పూర్తి దృష్టిని చదువుపైనే కేంద్రీకరించాలని,క్రమశిక్షణను అలవర్చుకోవాలని డీసీపీ సూచించారు. అలాగే సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని హితవు పలికారు. విద్యార్థినులకు సైబర్ భద్రత,డ్రగ్స్ (మాదకద్రవ్యాల) వల్ల కలిగే అనర్థాలు,ట్రాఫిక్ నిబంధనలు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. ఏవైనా వేధింపులు,బెదిరింపులు (ర్యాగింగ్/బిల్డింగ్) లేదా అనుమానాస్పద కార్యకలాపాలు ఎదురైతే ఎలాంటి సంకోచం లేకుండా తక్షణమే ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. అంతకుముందు కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను కూడా ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నర్సయ్య సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు

### పార్టీలో సరైన గుర్తింపు లేదని అసంతృప్తి



**వాజేడు,జులై 25.(ప్రజావినికిడి):**

ములుగు జిల్లా వాజేడు మండలంలో సీనియర్ నాయకుడి రాజీనామాతో మండల కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు మరొక్కసారి వేడెక్కాయి. గత పది సంవత్సరాలుగా అధికారంలో లేకపోయినా పార్టీని వీడకుండా పనిచేసి అధికారం రావడం కోసం తన వంతు కృషి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకు కృషి చేసినా కూడా పార్టీలో సరైన గుర్తింపు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లె దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత ఏడు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులుగా పని చేశానని తెలియజేశారు. గత కొంతకాలంగా పార్టీలో జరుగుతున్నటువంటి విభేదాలే ఇందుకు కారణమని అన్నారు. అనంతరం ఆయన రాజీనామా లేఖలో ప్రస్తుత కాలంలో సంక్షేమ పథకాల విషయంలో గాని పార్టీకి సంబంధించిన విషయాలల్లో గాని తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వకపోవడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపారు. ఇటువంటి విషయాలను గూర్చి పై నాయకత్వానికి పలుమార్లు తెలియజేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని విసుగుచెంది రాజీనామా చేయక తప్పడం లేదని తెలిపారు. ఇట్టి రాజీనామాను ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆమోదించాలని లేఖలో పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండి

## నేను మీకు ముందుంటా -6వ,వార్డు సభ్యుడు లింగారం మహేష్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**దూసకల్ గ్రామం 6వ,వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే తన మొదటి ప్రాధాన్యత అని పేర్కొంటూ 6వ, వార్డు సభ్యుడు లింగారం మహేష్ ఆధ్వర్యంలో వార్డులో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. వార్డులో అధికంగా పెరిగిన పిచ్చి చెట్లు కలుపు మొక్కలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని వార్డు సభ్యులు చెప్పడంతో వెంటనే స్పందించిన మహేష్ సంబంధిత సిబ్బందితో కలిసి పిచ్చి చెట్లకు మందు స్ప్రే కొట్టించి వాటిని పూర్తిగా తొలగించే చర్యలు ప్రారంభించారు
వార్డులో పిచ్చి చెట్లు విపరీతంగా పెరగడం వల్ల పాములు తేళ్లు విషపురుగులు ప్రమాదం భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు సందర్భంగా వార్డు సభ్యుడు లింగారం మహేష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలే నా సమస్యలు 6వ వార్డులో ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే నాకు తెలియజేయండి. నేను ఎప్పుడూ మీ ముందుంటాను. పరిశుభ్రమైన, సురక్షితమైన వార్డును తీర్చిదిద్దడం మనందరి బాధ్యత..ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం అని తెలిపారు.వార్డ్ సభ్యులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన వార్డు సభ్యుడు లింగారం మహేష్‌ను అభినందించారు.

# మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాతృమూర్తి అకాల మరణం

## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఉమ్మడి పాలమూరు బీఆర్ఎస్ నేతలు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ అకాల మరణం పట్ల ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నాయకులు అదేవిదంగా మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి,శ్రీనివాస్ గౌడ్,లక్ష్మా రెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేష్ రెడ్డి,రామ్ మోహన్ రెడ్డి,రాజేంద్రనగర్ ఇంచార్జ్ పట్లోల్ల కార్తీక్ రెడ్డి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.షాబాద్ లోని పట్నం రుక్కమ్మ పార్తివ దేహానికి పూల మాల వేసి సంఘీభావం వ్యక్తం చేశారు.ఈ విషాద సమయంలో పట్నం నరేందర్ రెడ్డి,మహేందర్ రెడ్డి అలాగే అవినాష్ రెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ క్లిష్ట సమయంలో పట్నం కుటుంబానికి తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

# కేంద్ర,విద్యాశాఖ,మంత్రి రాజీనామా

## ప్రజాస్వామ్యం గెలిచింది..

### సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎండి. ఫైమీద..




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**నీట్ పేపర్ లీక్ వల్ల,దారుణంగా 21 మంది విద్యార్థులను బలిగొన్న కేంద్ర విద్యా శాఖ మంత్రి నిర్లక్ష్య వైఖరి నశించాలని,సి జె పి ప్రారంభించిన పోరాటం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కుర్చీలు కదిలించాయి ఎన్ని ప్రయత్నాలు చేసినా, పోరాటాన్ని ఆపలేకపోయారు,అనేక పార్టీలు అనేకమంది సెలబ్రిటీలు స్వచ్ఛంద సంస్థలు అనేక సంఘాలు, యువతి యువకులు తల్లిదండ్రులతో సహా ఈ పోరాటంలో మేము కూడా మీతో ఉన్నామని,ధైర్యంతో పాటు వాళ్లకు సపోర్టుగా ఉన్నామని చెప్పడం, పోరాటానికి, ఇంకా బలపడే విధంగా, సహకరించారు, వీటివల్ల పోరాటం ఇంకా,బలపడింది, ఫలించింది, ప్రారంభమై దాదాపు నెలరోజుల పాటు జరిగిన సుదీర్ఘ పోరాటం నాటికి విజయం సాధించింది కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల యువకుల పోరాటం ఫలించింది యువత తలుచుకుంటే ఏమైనా చేయొచ్చు పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప ప్రజాస్వామ్యం గెలిచింది. శాంతియుతంగా న్యాయమైన డిమాండ్లతో యువత విద్యార్థులు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని చెల్లా చెదురు చేసిన వారిపై అమానుషమైన చర్యలకు పాల్పడిన లాటి, ఛార్జ్ జరిపి గాయపరిచి, పోరాటం ఆగలేదు ఇంకా బలపడింది, అట్లాగే ఆడపిల్లలని,కూడా చూడకుండా క్రూరంగా ప్రవర్తించిన పోలీసులపై తగిన చర్య తీసుకోవాలి అని అన్నారు.

# విద్యార్థుల ఉద్యమానికి విజయం..

## కేంద్ర ప్రభుత్వం చర్చలతో(సీజేపీ) ఒప్పందం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం..

### తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మాజీ జడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ప్రారంభం నుంచే చర్చల ద్వారా పరిష్కరించి ఉంటే దేశవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు,ఆందోళనలు నివారించేవని ఆమె అన్నారు. ప్రజల గొంతును అణిచివేయడం, నిరసనలను నిర్లక్ష్యం చేయడం కంటే సంభాషణ ద్వారా సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.ఆలస్యమైనా కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చి సీజేపీతో ఒప్పందానికి రావడం సానుకూల పరిణామమే అయినప్పటికీ,ఒప్పందంలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో,నిర్దిష్ట కాలవ్యవధిలో అమలు చేయాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని ఆమె స్పష్టం చేశారు.దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రజల గొంతును వినడం,చర్చలకు ప్రాధాన్యం ఇవ్వడం, రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని ఆమె అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాలకు అండగా నిలుస్తుందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఒప్పందంలో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కోరారు.

# తొలి ఏకాదశి సందర్భంగా విశేష గోపూజ..

## గోపూజలో పాల్గొన్న షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..

### తొలి ఏకాదశి విశిష్టతను వివరించిన బక్కని..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి ఏకాదశి అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన్నారు. తన స్వగృహంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని గోపూజ నిర్వహించారు అనంతరం తొలి ఏకాదశి గురించి వివరిస్తూ పండుగలకు ఆదిమూలం.
తెలుగు సంవత్సరంలో అన్ని పండగలను వెంటపెట్టుకోచ్చే తొలి ఏకాదశి విశిష్టత,తొలి ఏకాదశి అంటే,ఆషాడ శుద్ధ ఏకాదశిని “తొలి ఏకాదశి” అంటారు. సంవత్సరం మొత్తం మీద వచ్చే 24 ఏకాదశులు (ప్రతీ నెల కృష్ణ పక్షంలో ఒకటి,శుక్ల పక్షంలో ఒకటి మొత్తంగా రెండు ఏకాదశులు వస్తాయి.)ఏదో ఒక ప్రత్యేకత సంతరించుకుంటాయి. ఏకాదశి అంటే పదకొండు అని అర్థం.మనకు ఉన్నటువంటి ఐదు జ్ఞానేంద్రియాలు,ఐదు కర్మేంద్రియాలు వీటిని పనిచేయించే అంతరేంద్రియం అయిన మనసు కలిపితే పదకొండు.ఈ పదకొండు ఏకోన్ముకంగా పనిచేసే సమయమే ఏకాదశి అని వివరించారు.

**తొలి ఏకాదశి విశిష్టత గురించి ఆయన మాటలో**

ఆషాఢ మాస ఏకాదశి తొలి ఏకాదశిగా (ఆషాఢ శుద్ధ ఏకాదశిగా) జరుపుకుంటారు. దీనినే “శయన ఏకాదశి,ప్రథమ ఏకాదశి”, “హరివాసరం”అని కూడా అంటారు. ఏకాదశిని ఒకరకంగా పరిశీలిస్తే,ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు (పంచ భూతాలు,సూర్య చంద్రులు,గ్రహాలు పరస్పర సంబంధాన్నీ,వాటి గమనాన్ని బట్టి )సంకేతంగా చెప్పుకోవచ్చు.ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుండి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కనిపిస్తాడు.సూర్యుడు దక్షణం వైపుకు మరలినట్లు,ఈ రోజు నుంచి దక్షణాయన ప్రారంభాన్ని సూచిస్తుంది.

**తొలి ఏకాదశి జరుపుకొను విధానం నియమాలు**

మహిమాన్వితమైన ఈ ఏకాదశి రోజున గోపూజ చేసిన,వ్రతాన్ని ఆచరించిన సూర్యచంద్ర గ్రహణములలో భూమి దానాలిచ్చినంత,అశ్వమేధ యాగం చేసినంత,అరవై వేల సంవత్సరాలు తపస్సు చేసినంత పుణ్యం లభిస్తుందని ఏకాదశి వ్రత మహత్యాన్ని గురించి మన పురాణాలు చెబుతున్నాయి వివరించారు.

**మహాసాధ్వీ సతీ సక్కుభాయి ఈ వ్రతాన్నే ఆచరించి మోక్ష సిద్ధి పొందటం..**

మహాసాద్ సతీ సక్కుబాయి ఈ వ్రతాన్ని ఆచరించి మోక్షసిద్ధి పొందిందని పురాణాల్లో ఏకాదశి విశిష్టతను గురించి పద్మ పురాణంలో వివరించారన్నారు.అష్టకష్టాలతో తల మునుకలౌతున్న మానవజాతిని ఉద్ధరించటానికి సాక్షాత్ శ్రీహరే ఈ ఏకాదశిని ఏర్పాటు చేసాడనీ,
ఈ వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరించిన వారు సమస్త వ్యధల నుంచీ విముక్తి పొందగలరనీ,మరణానంతరం వైకుంఠ ప్రాప్తి లభిస్తుందనీ పద్మ పురాణంలో పేర్కొన్నారని,ఇది ముఖ్యంగా రైతుల పండుగ.ఏరువాక లాగే తొలి ఏకాదశిని వేడుకచేసుకుంటారు. అతివృష్టి,అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని,పైరుకు ఏ రకమైన తెగుళ్ళు సోకకూడదని,ఏ రకమైన సమస్యలూ ఎదురవకూడదని భగవాన్ శ్రీమహావిష్ణువును ఒప్పుకుంటారు.

**తొలి ఏకాదశి రోజున గోమాతను పూజిస్తే.. శ్రీ మహావిష్ణువును పూజించినట్లే..**

ప్రతినెలా వచ్చే ఏకాదశి రోజున గోమాతను పూజిస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయని కేవలం ఇహమే కాకుండా ఏకాదశి వ్రతం పరం ప్రాప్తి కూడాఇస్తుంది.పురాణాలూ చెబుతున్నాయి.ఈమాసంలోనేబోనాలు,పశుపూజ, శకట ఆరాధనలు చేస్తారని వివరించారు.

# మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం..

## ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి “డాక్టరేట్“పొందిన శ్రీమతి గండు సంధ్యమణింద్ర

## డాక్టరేట్ పొందిన సంధ్యామణింద్ర ను ఘనంగా సన్మానించిన మున్నూరు కాపు సంఘం షాద్ నగర్ తాలూకా..




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిరాజా కన్వెన్షన్ హాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ “డాక్టరేట్“ పొందిన మున్నూరు కాపు కుల సోదరుని శ్రీమతి గండు.సంధ్యమణింద్రను ఘనంగా సన్మానించిన,
మున్నూరు కాపు షాద్ నగర్ తాలూకా అధ్యక్షుడు మేడిగ పెంటయ్య ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు మంచిరేవుల సాయికృష్ణ మాట్లాడుతూ, కుల సోదరులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగాలని ప్రధానంగా విద్య అన్నింటికీ ప్రమాణికంగా మారిన తరుణంలో ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ



విద్యారంగంలో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని తెలియజేశారు.షాద్ నగర్ పట్టణవాసి రిటైర్డ్ హెడ్ మాస్టర్ (జిహెచ్ఎం)గండు.విజయ నారాయణ వాళ్ల కోడలు గండు.సంధ్యమణింద్ర “ప్రస్థానం“రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోనీ చౌదరిగుడ గ్రామానికి చెందిన మల్చలం శంకర్‌అరుణ దంపతుల కుమార్తెనే “సంధ్యా మణింద్ర“తన విద్యాప్రస్థానం అంతా శంషాబాద్ లోనే పూర్తి చేసుకుని2015లో అగ్రికల్చర్ బీఎస్సీలో సీటు సాధించి, 2019లో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ అగ్రికల్చర్ ఎంటమాలజీ (కీటక శాస్త్ర)లో అచంచలమైన పట్టుదలతో యూనివర్సిటీ ఆఫ్ అగ్ అగ్రికల్చర్ సైన్సెస్ “రాయచూర్“లో డాక్టరేట్ పొందింది.ఈ కార్యక్రమంలో మంచిరేవుల సాయికృష్ణ,గండు నారాయణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్,ఇస్నాతీ శ్రీనివాస్,మల్చల మురళి,పడకంటి శ్రీశైలం,మంచిరేవుల అశోక్,సుప్ప దివాకర్,మల్చలం రమేష్, మేడిగ దామోదర్,గంధం శ్రీనివాస్, జి.మనింద్ర,రాఘవేంద్ర,అలాగే కుల సోదరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వ అసమర్ధతతోనే పేపర్ లీక్ లు..

## మధుయాష్కి గౌడ్..

### యువతపై పోలీసులతో అణిచివేత,

### రాహుల్ గాంధీ పట్ల దురుసు ప్రవర్తనకు నిరసనగా ఎల్బీనగర్ లో భారీ బైక్ ర్యాలీ..




**ఎల్బీనగర్,జులై, 25,(ప్రజా వినికిడి):**
మోడీ ప్రభుత్వ హాయంలో దేశంలో 152 సార్లు పేపర్ లీక్ సంఘటనలు జరిగినా ఒక్కరికి శిక్ష పడకపోకపోవడం సిగ్గుచేటని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ లకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఆందోళనలకు మద్దతుగా నిరసన చేపట్టిన రాహుల్ గాంధీ పట్ల దురుసు ప్రవర్తన, అరెస్ట్ ను నిరసిస్తూ మధుయాష్కి నేతృత్వంలో ఎల్బీనగర్ లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.వనస్థలిపురంలోని సుష్మ చౌరస్తా నుంచి వనస్థలిపురం మీదుగా ఎల్బీనగర్లోని అంబేద్కర్– జగ్జీవన్ రామ్ విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ,మోడీ ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీక్ లు జరుగుతున్నాయని విమర్శించారు. గతంలో పేపర్ లీక్ సంఘటనల్లో నిందితుల్లో ఉన్నవారికి క్లీన్ చిట్ ఇచ్చి వదిలేసారని విమర్శించారు. పేపర్ లీక్ కు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న యువతపై మోడీ ప్రభుత్వం పోలీసులతో క్రూరంగా కొట్టించడమే కాకుండా.. విద్యార్థునులపై అసభ్యకరంగా, అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారునీట్ పేపర్ లీక్ తో 22 లక్షల మంది విద్యార్థులు వారి కుటుంబాలు ఆవేదనకు లోనయ్యా అన్నారు,మనోవేదనతో పలువురు విద్యార్థులు ఈ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులు, బాధిత కుటుంబాలకు ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. విద్యార్థులకు అండగా నిలబడి కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, రాహుల్ గాంధీ విద్యార్థుల కోసం పార్లమెంటులోనూ,బయట ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు.పార్లమెంటులో రాజ్యసభలో పేపర్ లీక్ లపై చర్చ జరగాలని పట్టుబడుతున్నామోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు.విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన ఆగదన్నారు.కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే కాకుండా.. చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాల్సిందనని డిమాండ్ చేశారు.తల్లిదండ్రులు తమ కష్టార్జితంతో పిల్లలను చదివిస్తుంటే.. పేపర్ లీక్ లతో విద్యార్థుల భవిష్యత్తును మోడీ ప్రభుత్వం నాశనం చేస్తుందని విమర్శించారు.
దేశంలో విద్యా వ్యవస్థను కూడా నాశనం చేస్తుందని.. మోడీ ప్రభుత్వ హయంలో దేశంలో లక్షలల పాఠశాలలు మూతపడ్డాయని విమర్శించారు. విద్యార్థుల పక్షాన నిలబడి రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి పోరాడుతున్నారని.. విద్యార్థులు ఎవరు ఆందోళన చెందవద్దని, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా,యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, వజీర్ ప్రకాష్ గౌడ్,పార్టీ జనరల్ సెక్రెటరీ పృథ్వి చౌదరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూరెళ్ల వేములయ్య గౌడ్,డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బడి పిల్లల ప్రాణాలతో

# చెలగాటం..

### ఒకే ఆటోలో 20 మంది విద్యార్థులు

**రోజు నియోజకవర్గంలో ఏదో ఒక చోట సంఘటనలు జరుగుతున్న పట్టించుకోని అధికార యంత్రాంగం..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలో పాఠశాల విద్యార్థుల భద్రతపై అధికారుల హెచ్చరికలు కొనసాగుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని కుంటబడి స్కూల్‌కు చెందిన సుమారు 20 మంది విద్యార్థులు ఒకే ఆటోలో స్కూల్ ముగించుకుని ఇంటికి వెళ్తున్న దృశ్యం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఆటోలో కూర్చునేందుకు కూడా తగిన స్థలం లేకపోవడంతో కొందరు విద్యార్థులు నిల్చునే ప్రయాణించగా,మరికొందరు ట్రాలీ డోర్ పై నిల్చోని ప్రయాణిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నపాటి ప్రమాదం జరిగినా భారీ విషాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల విద్యార్థుల రవాణా వాహనాలకు సంబంధించిన ప్రమాదాలు అటు రాష్ట్రవ్యాప్తంగా, నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశమైనప్పటికీ, కదలని అధికార యంత్రాంగం

నిన్నటికి నిన్న కస్లాబాద్ ఘటనకొందరు బస్సు& ఆటో డ్రైవర్లు ఇంకా నిబంధనలను బేఖాతరు చేస్తూ సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.పాఠశాల యాజమాన్యాలు కూడా విద్యార్థుల రవాణాపై మరింత బాధ్యతతో వ్యవహరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల ప్రాణాల భద్రత దృష్ట్యా రవాణా శాఖ,ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఓవర్‌లోడ్ ఆటోలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మరో ప్రమాదం జరిగాక స్పందించడం కంటే,ముందస్తు చర్యలతో ఇలాంటి నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## షాద్ నగర్&ఫరుక్ నగర్ మండలంలో 75 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ





**షాద్‌నగర్,(షాద్ నగర్):**పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 75 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాల చెక్కులను షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్థానిక ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్ నాగయ్యతో కలిసి పంపిణీ చేశారు.ఫరూఖ్ నగర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన (29)మంది,షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని (46) మంది లబ్ధిదారులకు మొత్తం రూ.(75,83,700)విలువైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కల్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని,సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. చెక్కులు పొందిన లబ్ధిదారుల తమ సంతోషాన్ని వ్యక్తంచేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి,స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే శంకర్ కు రుణపడి ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,ఫారుక్ నగర్ తహసీల్దార్ నాగయ్య,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్,కౌన్సిలర్ లు కొప్పునూరి ప్రవీణ్,రాజు నాయక్,దిలీప్,ముబారక్ అలీ ఖాన్,చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి,హైదర్ గోరి,సాదిక్,పాషా,వివిధ మండలాల ప్రజాప్రతినిధులు,సర్పంచులు,అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

## ఫరుఖ్ నగర్ లోని బ్రహ్మంగారి గుడిలో తొలి ఏకాదశి సందర్భంగా గీతా పారాయణం

**కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఫరూక్ నగర్ లో ని శ్రీ శ్రీ బ్రహ్మంగారి గుడిలో శనివారం రోజు తొలి ఏకాదశి సందర్భంగా గీతా పారాయణం బృందం చేత గీతా పారాయణం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాని కి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొని తన భక్తి భావాన్ని చాటుతూ దేశ ప్రజలంతా దైవిక కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని, ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అందె మోహన్ కౌన్సిలర్లు కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్,రాజు నాయక్ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ ఖదీర్ నాయకులు గంగనమోని సత్తయ్య,గంగాధర్ రిటైర్డ్ ఎంఈఓ ఆకుల విద్యాసాగర్,కుర్వగడ్డ నరసింహులు,సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జానపద సాంప్రదాయానికి అద్దం పట్టే 'బాయిలోనే బంగారు తల్లి' పాట

**బాయిలోనే బంగారు తల్లి ఎల్లమ్మ' బోనం పాట**

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌పాట పోస్టర్ ఆవిష్కరణ**





**షాద్‌నగర్,(ప్రజా వినికిడి):**పట్టణంలోని ఈశ్వర్ కాలనీకి చెందిన విఘ్నేష్,కీర్తి తదితరులు కలిసి రూపొందించిన “బాయిలోనే బంగారు తల్లి ఎల్లమ్మ బోనం“ జానపద గీతం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగకు సంబంధించిన జానపద గీతాలను యువత రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఇలాంటి పాటలు తెలంగాణ ఆత్మను,గ్రామీణ సంప్రదాయాలను భావితరాలకు చేరవేస్తాయని అన్నారు.పాట విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భీమారం వాగు పైన నిజాం కాలంలో నిర్మించిన

# చెక్ డ్యామ్ -నేటి కి చెక్కుచెదరని వైనం..

**భీమారం వద్ద కల్వర్టు, వాగును పరిశీలిస్తున్న: మాజీ ఎమ్మెల్యే -వాగు పై ఉన్న “చెక్ డ్యామ్“ పునరుద్ధరిస్తే పరిసర ప్రాంత రైతులకు సాగునీరు..**



**షాద్ నగర్,(ప్రజా వినికిడి):** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలంలోని దశాబ్దాల చరిత్ర కలిగిన భీమారం గ్రామ వాగు వందలాది మంది అన్నదాతల కుటుంబాల ఆకలిని తీర్చింది.గతంలో రైతులకు సాగునీరు,త్రాగునీరు అందించిన భీమారం వాగు నేడు ఆదరణ లేక నిరుపయోగంగా మారిన వైనం,ఈ వాగు పైన ఏడవ (7)నిజాం పాలనలో చెక్ డ్యామ్ నిర్మించి రెండు (2)తూములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ వాగు నుంచి ఎడమ తూము ద్వారా సూరారం గ్రామ పరిధిలోని సుమారు(300)వందల ఎకరాల పైచిలుకు భూమి సాగు బడి అయ్యేదని నేడు అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల ఆ కాలువ ద్వారా నీరుపారలేనిపరిస్థితి,వ్యవసాయ రంగానికి నీరు చేరవేతతో పంటలు పండి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహాయపడేవి. అలాంటి వాగులు,కుంటలు నేడు నిరుపయోగంగా మారిన దాఖలాలు కళ్లకు కట్టినట్టు కనవడుతున్నాయి.పంటలతో కలకాడలాడిన నేలలు నేడు ఇటు వర్షాలు లేక,భూగర్భ జలాలు అడుగంటడంతో



దిక్కుతోచని స్థితిలో అన్నదాతల పరిస్థితి,ఈ వాగు పైన నిర్మించిన చెక్ డ్యామ్,తూములను అధికారులు పరిశీలన చేసి మరమ్మత్తులు చేస్తే రైతులకు సాగునీరుతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని బక్కని నర్సింలు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో భీమారం గ్రామ రైతులు,యువకులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ప్రాణాలతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు చెలగాటం..

**విద్యార్థులతో చెలగాటమాడితే “ఏబీవీపీ“చూస్తూ ఊరుకోదు..**

**ఫిట్ నెస్ లేని స్కూల్,కాలేజీ బస్సులపై తక్షణమే తనిఖీలు చేపట్టాలి..ఆర్టీఓ స్వప్న ఏబీవీపీ వినతి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**విద్యార్థుల ప్రాణాలతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు చెలగాటమాడితే ఏబీవీపీ చూస్తూ ఊరుకోదని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఆర్టీఓ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శనివారం షాద్ నగర్ పరిధి రవాణా అధికారి (ఆర్టీవో) స్వప్న ను ఏబీవీపీ బృందంతో కలిసి, ప్రైవేట్ పాఠశాలలు మరియు కళాశాలల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలపై ఒక సమగ్రమైన వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా దార పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, షాద్ నగర్ పరిధిలో ప్రతిరోజూ వేలాది మంది పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తున్నారని,అయితే కేవలం లాభాలే పరమావధిగా భావిస్తున్న కొన్ని యాజమాన్యాలు కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని మండిపడ్డారు.కాలం చెల్లిన,కండీషన్ లేని బస్సులను రోడ్లపైకి తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలను పణంగా పెడుతున్నారని,అనేక వాహనాలకు కనీసం ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కూడా లేకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్టీఓ స్వప్న ఆధ్వర్యంలో తక్షణమే ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి,అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు రోడ్డుపైనే ముమ్మర తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.కేవలం కాగితాలకే పరిమితం కాకుండా బస్సుల బ్రేకులు,టైర్ల నాణ్యత, అత్యవసర ద్వారాలు (ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్) ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు,ఫస్ట్ ఎయిడ్ బాక్సులను స్వయంగా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.అలాగే అనుభవం లేని డ్రైవర్ల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని,కాబట్టి డ్రైవర్ల హెవీ లైసెన్సులతో పాటు వారి శారీరక,మానసిక ఫిట్‌నెస్‌ను కూడా పరీక్షించాలన్నారు.కొన్ని విద్యాసంస్థలు సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నాయని,అలాంటి వాహనాల పర్మిట్లను రద్దు చేసి,యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.విద్యార్థుల ప్రాణాల రక్షణ కోసం ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని, అధికారులు తక్షణమే స్పందించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆర్టీఓ అధికారిని స్వప్న మాట్లాడుతూ,విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, నిబంధనలు ఉల్లంఘించే స్కూల్ బస్సులపై త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పవన్ కళ్యాణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి విజయ్,పవన్,సంతోష్, భార్గవ్,తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు..

**జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..**

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆధ్వర్యంలో పర్యవేక్షణ..**







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతోకిటకిటలాడింది,స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.దర్శనానంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసు యంతాంగం బందోబస్తు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారి దర్శనానికి విచ్చేసిన షాద్ నగర్ కోర్టు జడ్జి కొత్త రవి,షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ,సీఐ సీతా రామ్,లు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.అనంతరం బక్కని నరసింహులు దేశ ప్రధాని నరేంద్ర మోడీ,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు పేర్ల పైన అర్చన చేయించారు. దేశంలోని ప్రజలందరూ దైవచింతనతో ఆయురారోగ్యంగా ఉండాలని,వర్షాలు బాగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని,పంటలు బాగా పండాలని,ప్రజలంతా పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అనంతరం దేవాలయానికి విచ్చేసిన జడ్జి కొత్త రవి,ఏసిపి,సీఐలను పూలమాలు, శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రతాపరెడ్డి(చింటు),ఒగ్గ కిషోర్,కుమార్ గౌడ్,మోహన్ రెడ్డి,రమేష్, రాంభూపాల్,యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

**జూలై 25,(ప్రజావినికిడి):**
విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు-నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా




విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది.

పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజెపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజెపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదారి పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

# హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

**మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన**

**సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ**

**న్యూఢిల్లీ,జూలై 25,(ప్రజావినికిడి):**
హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూదని




కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.

# ఏపీలో పెరుగుతున్న కరోనా కేసులు.. మరో ఏడుగురికి పాజిటివ్

**ఏపీలో విస్తరిస్తున్న కరోనా మహమ్మారి -39కి చేరిన యాక్టివ్ కేసుల సంఖ్య**

**కరోనా పరీక్షల సంఖ్యను పెంచాలని ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశం**



**జూలై 25,(ప్రజావినికిడి):**
ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. తాజాగా మరో 7 కొత్త కేసులు నమోదు కావడంతో, ఇప్పటివరకు ఉన్న మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 39కి చేరింది. బాధితులందరినీ వెంటనే వైద్యుల పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు వీరితో ప్రైమరీ కాంటాక్ట్‌లో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియను ఆరోగ్య శాఖ సిబ్బంది వేగవంతం చేశారు.పరిస్థితిని సమీక్షించిన అధికారులు... జిల్లాల వారీగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. కరోనా పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించారు. ఎవరికైనా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు.ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరారు. రద్దీగా ఉండే ప్రదేశాల్లో తప్పనిసరిగా మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం, చేతులను తరచూ పరిశుభ్రంగా ఉంచుకోవడం చేయాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

**గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే**



**న్యూఢిల్లీ,జూలై 25,(ప్రజావినికిడి):**
నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

# ఎఐతో ఉన్న భయాలు తొలగించాలి

**ఎఐ ఉన్న అపోహలు తొలగిస్తేనే భవిష్యత్**

**మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు**



**న్యూయార్క్,జూలై 25,(ప్రజావినికిడి):**
ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత కు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

# నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

**మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు**

**ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,జూలై 25,(ప్రజావినికిడి):**



దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' అని ఆమె స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

# వివాదంలో విక్రమ్ తనయుడు..

## ధ్రువ్‌పై నిర్మాతల మండలిలో ఫిర్యాదు!



ప్రముఖ కోలీవుడ్ నటుడు చియాన్ విక్రమ్ కుమారుడు, యువ హీరో ధ్రువ్ విక్రమ్ ఓ వివాదంలో చిక్కుకున్నారు. వృత్తిపరమైన నిబద్ధతను ఉల్లంఘించారంటూ నీలాద్రి ప్రొడక్షన్స్, పెన్ స్టూడియోస్ సంస్థలు ఆయనపై తమిళ ఫిలిం ఛాంబర్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశాయి. ఒప్పందం ప్రకారం తమ సినిమాను పూర్తి చేయకుండా మరో ప్రాజెక్టును ప్రారంభించి తమను ఆర్థికంగా నష్టపోయేలా చేస్తున్నారని నిర్మాతలు ఆరోపించారు.వివరాల్లోకి వెళితే.. ధ్రువ్ విక్రమ్ తన నాలుగో చిత్రంగా (చణం4) రమేశ్ వర్మ దర్శకత్వంలో నటించేందుకు అంగీకరించారు. ఈ సినిమా కోసం నిర్మాతల నుంచి ఆయన రూ. 1 కోటి అడ్వాన్స్ కూడా తీసుకున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా మొదలయ్యాయి. ఒప్పందం ప్రకారం ఈ సినిమా పూర్తయి విడుదలైన తర్వాతే ధ్రువ్ మరో సినిమా చేయాల్సి ఉంది. అయితే, ఈ ఒప్పందాన్ని పక్కనపెట్టి ధ్రువ్ విక్రమ్, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో కరణ్ దర్శకత్వంలో తన ఐదో చిత్రాన్ని ఇటీవలే ప్రారంభించారు.దీనివల్ల తమ ప్రాజెక్ట్ ఆలస్యమై, పెట్టిన పెట్టుబడిపై వడ్డీ భారం పెరిగి తీవ్రంగా నష్టపోతామని నిర్మాతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమతో సంప్రదించకుండానే ధ్రువ్ మరో ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లో ఇలా ప్రాజెక్టులు మధ్యలో ఆగిపోవడం లేదా వివాదాస్పదం కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఏఆర్ మురుగదాస్, మణిరత్నం వంటి దిగ్గజ దర్శకులతో ప్రకటించిన సినిమాలు కూడా వివిధ కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. నటుడిగా మంచి ప్రతిభ ఉన్నప్పటికీ, ఇలా తరచూ ప్రాజెక్టుల విషయంలో వివాదాలు రావడం ఆయన కెరీర్ స్థిరత్వంపై ప్రభావం చూపుతోందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు తమిళ ఫిలిం ఛాంబర్ ఇరువర్గాల మధ్య మధ్యవర్తిత్వం వహించనుంది. ఇప్పటికే మైత్రీ మూవీస్‌తో భారీ బడ్జెట్ సినిమా మొదలుకావడంతో ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోవాల్సిన ఒత్తిడి ధ్రువ్‌పై పెరుగుతోంది. కోలీవుడ్, టాలీవుడ్‌లో తన విశ్వసనీయతను నిలబెట్టుకోవాలంటే పెండింగ్ కమిట్‌మెంట్లను పూర్తి చేయడం ఆయనకు అత్యవసరమని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆదర్శ కుటుంబం లో నారా రోహిత్..

## ఆసక్తి రేపుతున్న ఫస్ట్ లుక్ పోస్టర్




విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో డైనమిక్ యాక్టర్ నారా రోహిత్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించింది. నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ, ఆయనకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో.. "డైనమిక్ నారా రోహిత్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. చూఖ47 ప్రాజెక్టులోకి మీకు స్వాగతం పలుకుతున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నాం" అని పోస్ట్ చేసింది. విడుదల చేసిన పోస్టర్‌లో నారా రోహిత్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌ను బట్టి చూస్తే, ఆయన ఈ చిత్రంలో ఒక పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ చిత్రానికి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - ూఖ 47' అనే వినూత్నమైన టైటిల్‌ను గత ఏడాది డిసెంబర్‌లో ఖరారు చేశారు. అప్పట్లో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో వెంకటేశ్ రోడ్డు మధ్యలో చిరునవ్వుతో నిలబడి ఉన్న లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. వెంకటేశ్ ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోగా ఇప్పుడు తన ఫేవరెట్ దర్శకుల్లో ఒకరైన త్రివిక్రమ్‌తో జత కట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది.నిజానికి త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటిస్తున్న పూర్తిస్థాయి చిత్రం ఇదే మొదటిది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా రాకపోయినా వెంకటేశ్ కెరీర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రానికి త్రివిక్రమ్ రచయితగా పనిచేశారు. ఆ సినిమా విజయంలో ఆయన సంభాషణలు కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు నేరుగా ఆయన దర్శకత్వంలోనే సినిమా వస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి.గత ఏడాది ఆగస్టులో ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు జరగ్గా, ఈ బుధవారం నుంచి అధికారికంగా షూటింగ్ ప్రారంభం కానుంది. చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. నారా రోహిత్ చేరికతో సినిమా తారాగణం మరింత బలంగా మారింది.

# మంచి పాత్రల కోసమే వేచి చూస్తున్నా..

## పెళ్లికి కూడా తొందరలేదు: నిధి అగర్వాల్



సినిమా అవకాశాల కోసం తాను ఎప్పుడూ తొందరపడనని... జీవితంలో సినిమాలైనా, పెళ్లయినా దేనికీ హడావుడి పడేది లేదని నటి నిధి అగర్వాల్ స్పష్టం చేసింది. మంచి కథలు, అర్థవంతమైన పాత్రల కోసమే తాను వేచి చూస్తున్నానని తెలిపింది. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' చిత్రాల తర్వాత తమిళంలో మళ్లీ నటించకపోవడానికి సరైన ప్రాజెక్ట్ రాకపోవడమే కారణమని చెప్పింది. నటనకు ప్రాధాన్యం ఉండే పాత్రలు చేయడానికి తమిళ చిత్రసీమ సరైన వేదిక అని వ్యాఖ్యానించింది.పవన్ కల్యాణ్‌తో 'హరి హర వీరమల్లు', ప్రభాస్‌తో 'ది రాజా సాబ్' వంటి భారీ చిత్రాల్లో నటించడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు నిధి తెలిపింది. ప్రస్తుతం తెలుగు, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్లే తమిళ సినిమాలకు కాస్త దూరమయ్యానని పేర్కొంది. వృత్తిపరంగా తాను ఎంతో కష్టపడతానని, అయితే మిగతా విషయాల్లో చాలా సోమరినని సరదాగా వ్యాఖ్యానించింది. అలాగే తనది చాలా సున్నితమైన మనస్తత్వమని, అందుకే భావోద్వేగాలను బయటకు చూపించనని తెలిపింది.

ప్రస్తుతం మరో రెండు కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వాటి వివరాలు వెల్లడిస్తానని నిధి చెప్పింది. ఇకపోతే ఆమె త్వరలోనే 'మిరాయ్' పార్ట్-2 తో పాటు హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్' చిత్రాల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# క్లిక్ అయితే సెకెండ్ ఇన్నింగ్స్ నెక్ట్స్ లెవల్!



నటసింహ బాలకృష్ణ చిత్రాలలో ప్రతి పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ముఖ్యంగా ఆయన సినిమాల్లో విలన్ పాత్రలు ..బలమైన నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తాయి. తాజాగా తెలుగు నటి ఐశ్వర్య రాజేష్ బాలయ్య సినిమాలో ఓ నెగెటివ్ రోల్‌లో కనిపించనుందని వార్తలొస్తున్నాయి. ఇప్పటి వరకు తనదైన నటనతో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించిన ఐశ్వర్యా రాజేష్ ఇప్పుడు ఏకంగా నెగెటివ్ షేడ్స్ పాత్ర ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు కోరటాల శివ రాసిన నెగిటివ్ రోల్ కు ఐశ్వర్యకు పర్ఫెక్ట్ గా సూటువుతుందని అంటున్నారు. మరి ఇందులో నిజాలు తేలాల్సి ఉంది. సాధారణ నటిగా కెరీర్ ప్రారంభించి సహజ సిద్ధమైన నటనతో నటిగా ఎదిగిన ఐశ్వర్య రాజేష్‌కు ఈ అవకాశం నిజమే అయితే పెద్ద సవాల్ అనే చెప్పాలి. సాధారణంగా హీరోయిన్లు కెరీర్ సెకండ్ హాఫ్‌లో ఇలాంటి ప్రయోగాలు చేయడానికి భయపడుతుంటారు. కానీ కథాబలం ఉంటే ఏ పాత్రనైనా చేయడానికి తాను సిద్ధమని ఐశ్వర్య నిరూపిం చుకుంటున్నారు. బాలయ్య లాంటి మాస్ హీరో సినిమాలో నెగెటివ్ రోల్ చేయడం అంటే సాధారణ విషయం కాదు. అది కూడా సినిమాలో కీలకమైన మలుపు తిప్పే పాత్ర అయితే నటనకు పూర్తి స్థాయిలో ఆస్కారం ఉంటుంది? ఐశ్వర్య రాజేష్ కెరీర్ నెక్ట్స్ లెవల్‌కు వెళ్లడం ఖాయం. ఇప్పటి వరకూ ఐశ్వర్యా రాజేష్ పోషించిన గృహిణి ... ఇంటెన్సివ్ లీడ్ రోల్స్ కంటే ఈ పాత్ర ఆమెలోని విభిన్న నటనను బయటకు తీసుకువస్తుంది. టాలీవుడ్‌లో పవర్‌ఫుల్ విలన్ పాత్రలు చేయడానికి నటీమణులు దొరకని ఈ రోజుల్లో ఐశ్వర్య లాంటి టాలెంటెడ్ ఆర్టిస్ట్ ఇలాంటి బాధ్యతను తీసుకోవడం నిజంగా సాహసోపేతమైన నిర్ణయమే.ఈ పాత్ర ద్వారా ఐశ్వర్య టాలీవుడ్ లో మాత్రమే కాకుండా ఇతర భాషల్లోనూ విలక్షణమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా మారే అవకాశం ఉంది. తెలుగు తెరపై పవర్ ఫుల్ విలనిజం పండించడానికి ఎంతోమంది సీనియర్ నటీమణులు ప్రయత్నించినా? సరికొత్త తరహా అప్రోచ్‌తో ఐశ్వర్య దీనికి పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందని చెప్పొచ్చు. ఒక స్టార్ హీరో సినిమాలో నెగెటివ్ షేడ్స్‌తో కనిపించడం ఆమె కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందనడంలో సందేహం లేదు. అభిమానులు కూడా ఐశ్వర్య రాజేష్‌ను ఒక సరికొత్త కోణంలో చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నటిగా తన పరిధులను విస్తరించుకోవడానికి ఆమె తీసుకున్న ఈ నిర్ణయం టాలీవుడ్‌లో ఇతర నటీమణులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుంది. -సంక్రాంతికి వస్తున్నాం- సినిమాతో ఐశ్వర్య రాజేష్ లో అసలైన బయట పడింది. ఆమెలో ట్యాలెంట్ ని పక్కాగా వినియోగించుకున్న దర్శకుల్లో అనీల్ రావిపూడి హైలైట్ అయ్యాడు. అప్పటి వరకూ ఐశ్వర్య పోషించని పాత్రలు ఒక ఎత్తైతే? సంక్రాంతి సినిమాలో అమ్మడు పోషించిన పాత్ర మరో ఎత్తులా నిలిచింది. ఆ పాత్రతో ప్రత్యేకమైన గుర్తింపు ఇండస్ట్రీలో దక్కిన సంగతి తెలిసిందే.

# రెండో రోజే 50 శాతం పడిపోయిన జన నాయగన్ కలెక్షన్లు




తమిళనాడు సీఎం విజయ్ నటించిన చివరి సినిమా 'జన నాయగన్' బాక్సాఫీస్ వద్ద తొలి రోజు భారీ ఓపెనింగ్ సాధించినప్పటికీ.. రెండో రోజే వసూళ్లు గణనీయంగా తగ్గాయి. సాక్‌నిల్క్ అంచనాల ప్రకారం.. తొలి రోజు ఈ చిత్రం రూ.42.70 కోట్ల నెట్ వసూలు చేసింది. రెండో రోజు రూ.21.15 కోట్ల నెట్ మాత్రమే రాబట్టింది. అంటే కలెక్షన్లు 50.5 శాతం తగ్గినట్లు అంచనా. దీంతో రెండు రోజుల్లో దేశీయ నెట్ కలెక్షన్లు రూ.63.85 కోట్లకు చేరాయి.

ప్రపంచవ్యాప్తంగా సినిమా రెండు రోజుల్లో రూ.112.5 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. ఇందులో భారత్ నుంచి రూ.75 కోట్ల గ్రాస్, విదేశాల నుంచి రూ.37.5 కోట్ల గ్రాస్ వచ్చినట్లు సమాచారం. రెండో రోజు ఓవర్సీస్‌లో రూ.10 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి.

ఈ చిత్రానికి తమిళ వెర్షనే ప్రధాన బలం. రెండో రోజు తమిళంలో రూ.17.95 కోట్ల నెట్ రాగా, హిందీలో రూ.1.85 కోట్లు, తెలుగులో రూ.1.35 కోట్లు వచ్చాయి. తమిళనాడులోనే అత్యధికంగా రూ.15 కోట్ల గ్రాస్ వసూలు కాగా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, కేరళ నుంచి కూడా మంచి వసూళ్లు నమోదయ్యాయి.అయితే ప్రేక్షకులు, విమర్శకుల నుంచి సినిమాకు మిశ్రమ స్పందన వస్తోంది. అయినప్పటికీ విజయ్‌కున్న స్టార్‌డమ్‌తో తొలి వారాంతంలో వసూళ్లు మరింత పెరిగే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే రెండో రోజే కలెక్షన్లు సగానికి పైగా పడిపోవడం మాత్రం చర్చనీయాంశంగా మారింది.

# నాన్న ఆపరేషన్ సక్సెస్ : బ్రహ్మాణి



సినిమా షూటింగ్ సమయంలో యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా గాయపడిన ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో మోకాలి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. గాయం తీవ్రత దృష్ట్యా ప్రత్యేక వైద్యుల బృందం ఆపరేషన్ నిర్వహించగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉంది. శస్త్రచికిత్స అనంతరం ఆయనను నెల రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.ఈ క్రమంలో బాలకృష్ణ కుమార్తె, మంత్రి నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రహ్మణి సోషల్ మీడియా ద్వారా ఆయన ఆరోగ్యానికి సంబంధించి అధికారిక సమాచారాన్ని పంచుకున్నారు. నాన్నకు ఆపరేషన్ సక్సెస్ ఫుల్‌గా ముగిసిందని, ఆయన వేగంగా కోలుకుంటూ పాత ఉత్సాహాన్ని తిరిగి పొందుతున్నారని ఆమె వెల్లడించారు. త్వరలోనే ఆయన మళ్లీ ప్రజాక్షేత్రంలోకి, పనుల్లోకి వస్తారని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో తమ కుటుంబం కోసం ప్రార్థించి మద్దతుగా నిలిచిన అభిమానులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రస్తుతం ఆసుపత్రిలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉన్న బాలయ్య మరో మూడు నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశముంది. అనంతరం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుని పూర్తిగా కోలుకున్న తర్వాత తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. కాగా, ఈ హఠాత్ పరిణామంతో ఆయన నటిస్తున్న »NBK 111' సినిమా చిత్రీకరణకు తాత్కాలికంగా విరామం పడింది. బాలయ్య కోలుకున్న వెంటనే తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించేందుకు చిత్రబృందం సన్నాహకాలు చేస్తోంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613